క్లుప్తంగా

పంచాయతీ రికార్డుల తనిఖీ

కొండమల్లేపల్లి: మండలంలోని దోనియాల గ్రామపంచాయతీ రికార్డులను సోమవారం ఎంపీఓ రమేశ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దోనియాల సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు గత వారం ఉప సర్పంచ్, వార్డు సభ్యులు జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేయడంతో రికార్డులను తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో రికార్డులు పరిశీలించాక ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆయన వెంట సర్పంచ్ కల్లు కవిత, ఉప సర్పంచ్ సరిత, పంచాయతీ కార్యదర్శి సరస్వతి, వార్డు సభ్యులు ఉన్నారు.

బీజేపీపై తిరుగుబాటుకు సిద్ధం కావాలి



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చింతపల్లి: ఎస్సీ వర్గీకరణ విషయంలో మోసం చేసిన బీజేపీపై మాదిగలు తిరుగుబాటుకు సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి బొజ్జ సైదులు పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 28న చేపట్టిన మాదిగల సంగ్రామ పాదయాత్ర సోమవారం చింతపల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు స్థానికంగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏప్రిల్ 3న బీజేపీ రాష్ట్ర కార్యాలయం ఎదుట ధర్నా, 4న హైదరాబాద్‌లోని ఔటర్ రింగ్‌రోడ్డు ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమార్పీఎస్ రాష్ట్ర నాయకులు వింజమూరి కృష్ణయ్య, దేవరకొండ ఇన్‌చార్జ్ సహదేవుడు, మాసని పెద్దయ్య, రమేశ్, శంకర్, మల్లయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుల ధర్నా

మిర్యాలగూడ: దామరచర్లలోని యాదాద్రి పవర్‌ప్లాంట్‌కు నిర్మిస్తున్న రైల్వే ట్రాక్‌లో భూములు కోల్పోతున్న కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని నర్సాపురం గ్రామానికి చెందిన బాధితులు సోమవారం రైల్వే ట్రాక్ నిర్మాణ పనులను అడ్డుకొని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్లాంట్ నిర్మాణానికి బొగ్గు సరఫరా కోసం విష్ణుపురం నుంచి యాదాద్రి ప్లాంట్ వరకు చేపట్టే రైల్వే ట్రాక్‌లో తమ భూములు కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే నిర్వహించి సంవత్సరం కావొస్తున్నా ఇప్పటికీ ప్రభుత్వం నుంచి తమకు ఎటువంటి పరిహారం అందలేదన్నారు. ఇప్పటికైనా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసి తమకు నష్టపరిహారం అందించాలని లేదంటే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు గాసిరాం, శ్రీను, రఘు, వినోద్, సైదా, సక్రు తదితరులు పాల్గొన్నారు.


విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు



హోమంలో పాల్గొన్న భక్తులు

పెద్దవూర: మండలంలోని వెల్మగూడెంలో సోమవారం నాభి శిల యంత్రం, ముత్యాలమ్మ, ఈదమ్మ గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠ, శివాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, బిల్డర్స్ అండ్ కాంట్రాక్టర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దాచిరెడ్డి వెంకటనర్సింహారెడ్డి(డీవీఎన్ రెడ్డి), సర్పంచ్ రావుల శ్రీను, హాలియా ఏఎంసీ వైస్ చైర్మన్ ఆడెపు రామలింగయ్య, ఉప సర్పంచ్ బాణాల శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాస్ పుస్తకాలు ఇవ్వాలి



దామరచర్ల తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

మిర్యాలగూడ: దామరచర్ల మండల పరిధిలోని సర్వే నంబర్ 148లోని అసైన్డ్ ల్యాండ్, పార్ట్-బీ భూములతో పాటు తాళ్లవీరప్పగూడెం గ్రామంలో సర్వే నంబర్ 95, 98లలో ఫారెస్ట్ భూమిని సాగుచేసుకుంటున్న రైతులకు పాస్ పుస్తకాలు అందించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం దామరచర్ల తహసీల్దార్ కార్యాలయంలో ఆయన వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు ధీరావత్ లింగానాయక్, నాయకులు ధనావత్ శాంతి, జమ్ముల కోటయ్య, రాము, రతన్‌సింగ్, వెంకన్న పాల్గొన్నారు.

పల్లెలకు రాని ఆర్టీసీ బస్సులు

- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ప్రయాణికులు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు



మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ ఆర్టీసీ డిపో పరిధిలో ఉన్న గ్రామీణ ప్రాంతాలకు రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ ఆర్టీసీ బస్సులు నడవడం లేదు. డిపో పరిధిలోని త్రిపురారం, అడవిదేవులపల్లి, నిడమనూరు, అనుముల, వేములపల్లి, మాడుగులపల్లి, తిప్పర్తి, దామరచర్ల, మిర్యాలగూడ మండలాల్లో సుమారు 100కు పైగా గ్రామీణ ప్రాంతాలను కలుపుకొని ఆర్టీసీ బస్సులు గతంలో నడిపించే వారు కానీ ప్రస్తుతం 20 నుంచి 30 గ్రామాలకు వరకు నామమాత్రంగా బస్సులను నడిపిస్తున్నారు. పల్లెలకు వెళ్లే పల్లె వెలుగు బస్సులకు ఎక్స్‌ప్రెస్ బోర్డులు తగిలించి పట్టణ ప్రాంతాలకు తిప్పుతున్నారు. కొన్ని రూట్లలో ఆదాయం రావడం లేదని, మరికొన్ని గ్రామాలకు రోడ్లు సరిగా లేవనే సాకుతో గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే బస్సులను పూర్తి స్థాయిలో రద్దు చేశారు. అయితే ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు వంద రోజుల పాటు చేపట్టిన 'ప్రజల వద్దకు ఆర్టీసీ' కార్యక్రమాన్ని పల్లెల్లో పెట్టకుండా కేవలం మండల కేంద్రాలు, పట్టణ ప్రాంతాలకే పరిమితం చేసి చేతులు దులుపుకున్నారు.

ప్రైవేట్ వాహనాలతో జేబుకు చిల్లు..

గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు నడవకపోవడంతో ప్రజలు, ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలు, ఆటోల్లో ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తుండడంతో వారిపై ఆర్థికంగా భారం పడటమే కాకుండా సరైన సమయంలో గమ్యస్థానాలకు చేరడం లేదు. కూలీ చేసుకునేందుకు పట్టణ ప్రాంతాలకు వచ్చే వారి జేబులకు చిల్లులు పడుతున్నాయి. గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించాలని అనేక సార్లు ఆర్టీసీ అధికారులకు విన్నవించినా ఎలాంటి ఫలితం లేదని ప్రయాణికులు వాపోతున్నారు.

బస్సులు లేక ఇబ్బందులు



కరోనా తరువాత గ్రామాలకు ఆర్టీసీ బస్సులను చాల వరకు తగ్గించారు. దీంతో గ్రామీణ విద్యార్థులు రెండు, మూడు కిలోమీటర్ల వరకు నడిచి ప్రధాన రోడ్డుపైకి వచ్చి బస్సులు ఎక్కి కళాశాలలకు వస్తున్నారు. ఆర్టీసీ అధికారులు విద్యార్థుల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని గ్రామాలకు బస్సులను పునరుద్ధరించాలి.

– నేరేళ్ల విజయ్, ఏబీవీపీ నేత, మిర్యాలగూడ

రెండేళ్లుగా బస్సు రావడం లేదు



మా గ్రామానికి రెండేళ్లుగా బస్సులు రావడం లేదు. అనేక సార్లు ఆర్టీసీ అధికారుల విన్నవించినా ఫలితం శూన్యం. రోడ్డు సౌకర్యం మంచిగా ఉన్నప్పటికీ బస్సులు నడపటం లేదు. గతంలో కరోనా కారణంగా కొన్నిరోజుల పాటు బస్సులు నిలిపివేశారు. తర్వాత ఆదాయం రావడం లేదని బస్సులు నడపటం లేదు. – మారం భిక్షమయ్య, మాజీ సర్పంచ్, తడకమళ్ల.

ఆదాయాన్ని బట్టి నడిపిస్తాం



గ్రామీణ ప్రజలు ఎక్కువ శాతం సొంత వాహనాల్లోనే ప్రయాణాలు సాగిస్తుండడంతో చాలా వరకు ఆర్టీసీ బస్సులను ఆదరించడం లేదు. త్వరలో ప్రతి గ్రామంలో ప్రజల వద్దకు ఆర్టీసీ కార్యక్రమాన్ని చేపడతాం. రాబోయే రోజుల్లో ఆదాయాన్ని బట్టి గ్రామీణ ప్రాంతాలకు పూర్తిస్థాయిలో బస్సులను నడిపించేలా చర్యలు తీసుకుంటాం.

– బొల్లెద్దు పాల్, ఆర్టీసీ డీఎం, మిర్యాలగూడ

విద్యార్థులే ఉపాధ్యాయులుగా..



దేవరకొండ: ఎస్వీఆర్ స్కూల్‌లో స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు



కొండమల్లేపల్లి: కొత్తబావి ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులు

దేవరకొండ: పట్టణంలోని ఎస్వీఆర్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో సోమవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులున్నారు.

వేములపల్లిలో..

వేములపల్లి: మండలంలోని మొల్కపట్నం ప్రాథమిక స్కూల్‌లో సోమవారం స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం పులి సరస్వతి, టీచర్లు, ఉప సర్పంచ్ రెమడాల కరుణాకర్, ఎస్ఎంసీ చైర్మన్ మాతంగి సునీత పాల్గొన్నారు.

కొండమల్లేపల్లిలో..

కొండమల్లేపల్లి: మండలంలోని కొత్తబావి ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వపరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏరుకొండ రాము, నరేందర్, మాష్లి శేఖర్, ఈరమ్మ, సత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

డిండి మండలంలో..

డిండి: మండల పరిధిలోని చెర్కుపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో సోమవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సుధామణీవెంకటర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వేములపల్లి: మొల్కపట్నం ప్రాథమిక స్కూల్‌లో..



డిండి: చెర్కుపల్లిలో జెడ్పీహెచ్ఎస్‌లో..

విద్యార్థులు పట్టుదలతో చదవాలి

మిర్యాలగూడ టౌన్: పదో తరగతి విద్యార్థులు పట్టుదలతో చదవి మంచి ఫలితాలు సాధించాలని వాసవీ క్లబ్ రీజినల్ చైర్మన్ మాశెట్టి శ్రీనివాస్, రిటైర్డ్ ఎంఈఓ ఆదినారాయణ, పందిరి రవీందర్ అన్నారు. సోమవారం పట్టణంలోని వాసవీ నగర్‌లో గల ఎస్‌వీ మోడల్ స్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు సమావేశానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థికి క్రమశిక్షణ ఎంతో అవసరం అని అన్నారు. విద్యార్థులు నైతిక విలువలను మర్చిపోవద్దని సూచించారు. పాఠశాల కరస్పాండెంట్ ఓరుగంటి శ్యాంసుందర్ మాట్లాడుతూ.. పదో తరగతిలో 10జీపీఏ సాధించిన విద్యార్థులకు రూ.10వేల చొప్పున పారితోషికం అందిస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ విశాలాక్షి, ఇన్‌చార్జి నాగలక్ష్మి, వాసవీ క్లబ్ జెడ్సీలు వేదశ్రీ, శ్రీనివాస్, ఎం. శ్రీనివాస్, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలను కించపరిస్తే సహించేది లేదు

మిర్యాలగూడ టౌన్: బీఆర్ఎస్, బీజేపీ నాయకులు మహిళలను కించపరిచే విధంగా మాట్లాడితే సహించేది లేదని టీపీసీసీ సభ్యుడు చిరుమర్రి కృష్ణయ్య, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పగిడి రామలింగయ్య, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి అన్నారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ ముఖ్య నేతలల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య మహిళా సర్పంచ్‌ను వేధింపులకు గురిచేయడం, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మహిళలను కించపరిచే విధంగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్, బీజేపీ నాయకులకు మహిళలంటే కనీస గౌరవం లేకుండా పోయిందని అన్నారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తమ్మడబోయిన అర్జున్, మాజీ సర్పంచ్ మేడా సురేందర్‌రెడ్డి, నాయకులు మెరుగు శ్రీనివాస్, ఎంఏ సలీం, చాంద్‌పాష, జానపాటి రవి, పాలిశెట్టి అజయ్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న టీపీసీసీ సభ్యుడు కృష్ణయ్య

క్రీడా సామగ్రి అందజేత

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు మండల కేంద్రానికి చెందిన ఆచంట రత్నకుమారి జ్ఞాపకార్థం ఆమె కుమారుడు ఆచంట కుటుంబరావు, పద్మజ దంపతులు సమకూర్చిన రూ.50వేలు విలువ గల క్రీడా సామగ్రిని సోమవారం తిరుమలగిరి సర్పంచ్ శాగం శ్రవణ్‌కుమార్‌రెడ్డి పాఠశాల ఉపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కొంగరి సత్యనారాయణ, ఉపాధ్యాయులు ప్రభాకర్‌రెడ్డి, గ్రామస్తులు కటికర్ల మల్లయ్య, మిట్టపల్లి దిలీప్‌కుమార్, మూగల మల్లయ్య, కుప్పాల అంజిరెడ్డి, శాగం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి



మిర్యాలగూడ టౌన్: మొల్ల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కుమ్మరి సంఘం నాయకులు

మిర్యాలగూడ టౌన్: కవయిత్రి మొల్ల జయంతి వేడుకలను సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని ఎన్ఎస్పీ క్యాంపులో కుమ్మరి సంఘం మిర్యాలగూడ నియోజకవర్గ అధ్యక్షుడు మల్లికంటి వెంకటయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కుమ్మరి సంఘం పట్టణ అధ్యక్షుడు నీలకంఠం అంజయ్య, యాదవ సంఘం నాయకులు మురళియాదవ్, సుధాకర్, శ్రీనునాయక్, సుమన్ తదితరులున్నారు.

కొండమల్లేపల్లిలో..

కొండమల్లేపల్లి: కవయిత్రి మొల్ల జయంతి వేడుకలను సోమవారం మండల కేంద్రంలో శాలివాహన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చౌరస్తా వద్ద ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శాలివాహన సంఘం అధ్యక్షుడు తోటపల్లి కిరణ్ మాట్లాడుతూ.. శ్రీకష్ణదేవరాయల కాలంలో తొలి తెలుగు కవయిత్రిగా మొల్ల గుర్తింపు పొందారని పేర్కొన్నారు. త్వరలోనే కొండమల్లేపల్లిలో మొల్ల విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దూదిపాల రేఖ, వైస్ ఎంపీపీ కాసర్ల వెంకటేశ్వర్లు, మాడ్గుల యాదగిరి, నీలకంఠం రాములు, ఏరుకొండ రాము, బొడ్డుపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు

దేవరకొండ: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలను సోమవారం దేవరకొండ పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే రవీంద్రకుమార్ హాజరై కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఎంపీపీ నల్లగాసు జాన్‌యాదవ్, జెడ్పీటీసీ అరుణాసురేష్‌గౌడ్, చింతపల్లి సుభాష్, శిరందాసు కృష్ణయ్య, రాహత్ అలీ, టీవీఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దేవరకొండ: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

మిర్యాలగూడలో..

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలకు ఎన్‌బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నల్లమోతు సిద్దార్థ హాజరై కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మహిళా పట్టణ అధ్యక్షురాలు పెండ్యాల పద్మ, మున్సిపల్ వైస్ చైర్మన్ కుర్ర విష్ణు, నాయకులు ఇలియాస్, సాధినేని శ్రీనివాసరావు, తిరుమలగిరి వజ్రం తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్



కొండమల్లేపల్లి: విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

పెద్దఅడిశర్లపల్లి: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అందుతుందని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని రంగారెడ్డిగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్యే సందర్శించి విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. అనంతరం పెద్దఅడిశర్లపల్లి మండల కేంద్రంలో జరుగుతున్న లింగమంతుల, గంగాభవాని జాతరకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదంలో గాయపడిన కోఆప్షన్ సభ్యుడు నిరంజన్, కృష్ణయ్యను ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో గొర్రెల, మేకల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు, ఎంపీపీ వంగాల ప్రతాపరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వల్లపురెడ్డి, ఏడుకొండల్‌యాదవ్, ముత్యంరావు, సిరసువాడ శ్రీను, సర్పంచ్‌లు గోర్ల సైదమ్మ, అరుణ, ఎంపీటీసీలు రాములు, బన్సీలాల్ తదితరులున్నారు.

అంధత్వ నివారణకే 'కంటి వెలుగు'

- నాగార్జునసాగర్ ఎమ్మెల్యే భగత్



4వ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భగత్

హాలియా: అంధత్వ నివారణకే రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపడుతోందని నాగార్జున సాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. సోమవారం హాలియా మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పేదల కష్టాలకు సంక్షేమ పథకాల రూపంలో పరిష్కారం చూపిన ఏకైక నాయకుడు సీఎం కేసీఆర్ అని అన్నారు. అనంతరం కంటి పరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంపటి పార్వతమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాజి వెంకటేశ్వర్లు, వివిధ మండలాల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కూరాకుల వెంకటేశ్వర్లు, పిడిగం నాగయ్య, ప్రధాన కార్యదర్శి యనమల సత్యం, కోఆప్షన్ సభ్యుడు సమీన అన్వరుద్దీన్, వార్డు అధ్యక్షుడు జానకిరాములు, రావిల్లా చెన్నయ్య, ముత్యాల జానయ్య, మున్సిపల్ మేనేజర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

వైభవంగా గంగమ్మ తల్లి జాతర



హాలియా: జాతరలో బ్యాండ్ వాయిస్తున్న ఎమ్మెల్యే భగత్



తిరుమలగిరి: బోయగూడెంలో జానారెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

హాలియా: అనుముల మండలంలోని చింతగూడెంలో సోమవారం నిర్వహించిన గంగమ్మ తల్లి జాతరకు నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి వేర్వేరుగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాజి వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి యనమల సత్యం, సర్పంచ్ కూరాకుల లింగమ్మ, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు వద్దిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆలయంలో కుందూరు జైవీర్‌రెడ్డి పూజలు..

జాతరకు కాంగ్రెస్ నాయకుడు కుందూరు జైవీర్‌రెడ్డి హాజరై పూజలు నిర్వహించారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గౌనీ రాజారమేష్‌యాదవ్, కుందూరు రాజేందర్‌రెడ్డి, గ్రామ అధ్యక్షుడు కూరాకుల సైదులు తదితరులు ఉన్నారు.

పెద్దవూరలో..

పెద్దవూర: మండలంలోని గర్నెకుంట గ్రామంలో గంగదేవమ్మ పండుగను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ పండుగకు ఎమ్మెల్యే నోముల భగత్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గుంటుక వెంకట్‌రెడ్డి, సర్పంచ్ నడ్డి హాలియమ్మ రామాంజి, ఆర్ఎస్ఎస్ మండల అధ్యక్షుడు గజ్జెల లింగారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జటావత్ రవినాయక్, వాసుదేవుల సత్యనారాయణరెడ్డి, కర్ణ బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరిలో..

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలోని బోయగూడెం, నెల్లికల్లు గ్రామాల్లో సోమవారం గంగమ్మ తల్లి జాతరను ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ఎమ్మెల్యే భగత్, సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాజి వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, రాజారమేష్‌యాదవ్, కాంసాని చంద్రశేఖర్, గడ్డం సాగర్‌రెడ్డి, సైదయ్య, గురువయ్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నిడమనూరు: మండల కేంద్రంలోని శాంతినికేతన్ పాఠశాలలో 2003-04లో పదో తరగతి చదివిన విద్యార్థులు సోమవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కట్టా నర్సింహారావు, సత్యం, వెంకటరెడ్డి, విద్యార్థులు విజయ్, వివకృష్ణ, వెంకన్న, రాయుడు, వెంకటేశ్వర్లు, శేఖర్, రమాదేవి, జ్యోతి, సంధ్యారాణి, సరిత, కవిత తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బీమా చెక్కు అందజేత

గుర్రంపోడు: మండలంలోని పిట్టలగూడెం గ్రామానికి చెందిన బొల్లం యాదయ్య ఇటీవల పాము కాటుకు గురై మృతిచెందాడు. యాదయ్య జీవిత బీమా చేయించుకోవడంతో అతడికి మంజూరైన రూ.7లక్షల చెక్కును సోమవారం అతడి భార్య వసంతకు ఎల్ఐసీ నల్లగొండ-1 బ్రాంచ్ మేనేజర్ రామచంద్రనాయక్ అందజేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ సహాయ మేనేజర్ బాలాజీనాయక్, డెవలప్‌మెంట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ఏజెంట్ అస్లాం బాబా తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లిలో రెండు పరీక్షా కేంద్రాలు

కొండమల్లేపల్లి: ఇంటర్ వార్షిక పరీక్షలు రేపటి నుంచి ప్రారంభంకానున్న నేపథ్యంలో మండల కేంద్రంలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎస్సీ గురుకులాల చీఫ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని ఎస్సీ గురుకుల పాఠశాలతో పాటు శ్రీక్రాంతి జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు

నిడమనూరు: మండలంలోని ఎర్రబెల్లి గ్రామంలో సోమవారం ఉదయం గ్రామపంచాయతీకి చెందిన బోరు మోటారు స్టార్టర్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఇది చూసిన గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. కొందరు నీటిని చల్లి మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించి, విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు కరెంట్ సరఫరాను నిలిపివేశారు. అనంతరం మంటలు ఆరిపోవడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

దేవరకొండ: గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో దేవరకొండ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత కొన్ని నెలలుగా కార్మికులకు వేతనాలు విడుదల చేయకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్యక్రమంలో జూలూరి వెంకట్రాములు, అలమోని మల్లయ్య, వీరయ్య, నరసింహ, అంజమ్మ తదితరులున్నారు.

విజయవంతం చేయాలి

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడలో రేపు నిర్వహించనున్న భీంరెడ్డి నర్సింహారెడ్డి శతజయంతి ఉత్సవాల ముగింపు సభను విజయవంతం చేయాలని ఎంసీపీఐ యూ కేంద్ర కమిటీ సభ్యుడు వస్కుల మట్టయ్య పిలుపునిచ్చారు. సోమవారం మిర్యాలగూడలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సభకు జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాదగోని రవి తదితరులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వరికుప్పల వెంకన్న, జిల్లా నాయకులు వస్కుల సైదమ్మ, వస్కుల గోపి, జ్యోతి, మోహన్ నాయక్ తదితరులున్నారు.

జాతీయ స్థాయికి ఎంపిక.. సన్మానం

కొండమల్లేపల్లి: కరాటే పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపికైన కొండమల్లేపల్లి కస్తూర్బా పాఠశాల విద్యార్థినులను సోమవారం పాఠశాలలో దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌వీటీ, శ్రీధర్‌గౌడ్, కృష్ణకిశోర్, ఎండీ ఖాజా, కరాటే మాస్టర్ శ్రీను, జగన్, ప్రిన్సిపాల్ అశ్రతమున్నీసా బేగం, విమల, స్వప్న, జ్యోత్స్న, ఈదమ్మ, అంజమ్మ, సుజాత, చంద్రకళ, నస్రీన్ బేగం, కమల, అంజి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌కు సన్మానం

హాలియా: హాలియా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆడెపు రామలింగయ్యను సోమవారం దళిత సంఘం, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుర్రి మొగులయ్య ఆధ్వర్యంలో పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా మార్కెట్ కమిటీ డైరెక్టర్ సురభి రాంబాబు, నందికొండ మున్సిపాలిటీ కౌన్సిలర్ ఆదాసు విక్రమ్‌ను కూడా సత్కరించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నేతలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సమతా సైనిక్ దళ్ ఆవిర్భావ వేడుకలు

డిండి: ఆలిండియా సమతా సైనిక్ దళ్ ఆవిర్భావ వేడుకలు సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ సమీపంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అంబేడ్కర్ అవార్డు గ్రహీత, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బుర్రి వెంకన్న ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ స్వాతంత్ర్య పోరాటంలో రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులతో కలిసి సమతా సైనిక్ దళ్ సంఘం ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు భిక్షపతి, ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, సలహాదారుడు రాజారావు, మండలాధ్యక్షుడు మల్లేష్, సురేష్ తదితరులున్నారు.